చెత్తకు బదులు సరుకులు

● తారకరామనగర్ పంచాయతీలో స్వచ్ఛ రథం ప్రారంభం



స్వచ్ఛ రథంలో చెత్తను సేకరించి తూకం వేస్తున్న డీపీవో సుశీలాదేవి

రేణిగుంట ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రీసైక్లింగ్‌కు ఉపయోగపడే పొడి చెత్త, ఇనుము, పేపర్లు, ప్లాస్టిక్, అట్టపెట్టెలు, బాటిళ్ల తదితరాలు తీసుకుంటారు. తూకంవేసి ఆ విలువ ప్రకారం సరుకులు ఇస్తారు. లేదంటే డబ్బులు చెల్లిస్తారు. దీనికోసం 'స్వచ్ఛరథం'ను జిల్లాలోనే మొదటిసారిగా ప్రయోగాత్మకంగా రేణిగుంట మండలం తారకరామనగర్ పంచాయతీలో సోమవారం సాయంత్రం డీపీవో సుశీలాదేవి ప్రారంభించారు. గతలో ఇంటింటికి రేషన్ పంపిణీకి వినియోగించిన వాహనాన్ని స్వచ్ఛరథంగా వినియోగిస్తున్నారు. స్థానిక పంచాయతీ నిధుల నుంచి డ్రైవరుకు రూ.25 వేల జీతం చెల్లిస్తారు. షెడ్యూల్ ప్రకారం.. ప్రాంతాలవారీగా స్వచ్ఛ రథం తిరుగుతూ ప్రజల నుంచి చెత్తను సేకరిస్తుంది. స్థానికంగా ఉండే ప్రజలు రోడ్లు, కాలువల్లో, పరిసరాల్లో చెత్త వేయకుండా ఉండేందుకు స్వచ్ఛ రథం పథకాన్ని అమలు చేస్తున్నట్లు డీపీవో తెలిపారు. 'ఈ చెత్త ద్వారా డబ్బు వస్తుందని తెలిస్తే గృహిణులు బయట వేయకుండా, ఒకచోట ఉంచి ఇస్తారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే డ్రైనేజీల్లో చెత్త లేకుండా, ఊరంతా శుభ్రంగా కనిపిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈశ్వరమ్మ, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి షణ్ముఖరామ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, కిషోర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, టీడీపీ బుజ్జి నాయుడు, బాలాజీ, మునిరాజా, వాసు, జైచంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. కనీసం పదేళ్ల అనుభవమున్న ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ తత్సమాన కేటగిరీ వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ప్రతిపాదనకు సంబంధించిన రెండు కాపీలను ఈనెల 24లోపు ఉప విద్యాశాఖాధికారులకు సమర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సెక్టోరల్, సహాయ సెక్టోరల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్, సహాయ సెక్టోరల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 23లోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో ఉపాధ్యాయులు అర్హులన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా కనీసం ఐదేళ్ల సర్వీసు లేదా సెకండరీ గ్రేడ్ టీచర్‌గా 8ఏళ్ల సర్వీసు కలిగి 55 సంవత్సరాల వయసు మించనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భక్తులను మోసగించే వారిపై కేసులు పెడతాం



దళారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భక్తులను మోసగించే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి హెచ్చరించారు. ముక్కంటి ఆలయం వద్ద దళారులుగా వ్యవహరిస్తూ భక్తులతో మాట్లాడుతున్న ఏడుగురిని ఆయన అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భక్తులకు మాయమాటలు చెప్పి మోసగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు.

తిరుమలలో వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని రూ.90 వేల స్వాహా

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరు దళారులపై హైదరాబాద్‌కు చెందిన భక్తుడు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. 12 మందికి దర్శనం ఏర్పాటు చేస్తానని చెప్పి గతేడాది ఆగస్టు 16న వనం నటరాజ నరేంద్రకుమార్, కేఎస్ నటరాజ శర్మ రూ.90వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత స్పందించలేదని తెలిపారు. కాగా ఈ ఇద్దరు దళారులు హైదరాబాద్‌లో పలువురిని ఇలాగే మోసం చేస్తున్నారని విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఇప్పటికే వీరిపై 12 కేసులు నమోదయ్యాయని తెలిసింది. దీంతో దర్శనం, వసతి కోసం దళారులను ఆశ్రయించవద్దంటూ టీటీడీ మరోమారు భక్తులకు ఒక ప్రకటనలో సోమవారం విజ్ఞప్తి చేసింది. అనుమానస్పదం అనిపిస్తే 0877 2263828 నెంబరు ద్వారా విజిలెన్స్ అధికారులను సంప్రదించాలని సూచించింది.





పెరిమిటిపాడు చెరువులో తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గుంతలు - చెరువు మట్టిని రాత్రివేళలో సూళ్లూరుపేటకు తరలిస్తున్న ట్రాక్టర్లు

మట్టి తవ్వేందుకు ఎక్స్‌కవేటర్లు. తరలించేందుకు ట్రాక్టర్లుంటే చాలు. ఇవన్నీ అద్దెకే వస్తాయి. అంతకు మించి పెట్టుబడి అవసరం లేదు. 'పవర్' చూపుతూ, అధికారులను 'మ్యానేజ్' చేసుకుంటూ రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతోంది మట్టి మాఫియా.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

చెరువులు తవ్వి.. రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తరలింపు

నిన్నా మొన్నటి వరకు.. నువ్వెంతంటే నువ్వెంతంటూ కత్తులు దూసుకున్నారు. ఇప్పుడు అధికార, ప్రతిపక్ష నేతల్లోని కొందరు ఒక్కటై మట్టి తవ్వేస్తున్నారు. సూళ్లూరుపేట మండలంలోని కుదిరి కొత్త చెరువు, పెద్ద చెరువు, పెరిమిటిపాడు చెరువు, తడ మండలంలోని



కుదిరి కొత్త చెరువులో మట్టిని తవ్వేసిన దృశ్యం

కారిజాత చెరువులను రోజూ యంత్రాలతో తవ్వి.. పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలించి విక్రయిస్తున్నారు. చీకటి పడితే చాలు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు చెరువుల్లోకి క్యూ కడతాయి. సూళ్లూరుపేట పట్టణంలోని ఇళ్ల ప్లాట్లు, సమీపంలోని వెంచర్లకు, కొత్తగా ఏర్పాటుచేసే పరిశ్రమలకు మట్టి తరలిస్తున్నారు. కుదిరి చెరువులో రాత్రి 10 గంటలైతే చాలు జాతరను తలపించేలా యంత్రాలు, ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నాయి. దావాదిగుంట, షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం మీదుగా రాత్రివేళల్లో రయ్..రయ్ అంటూ మట్టి ట్రాక్టర్లు వేగంగా దూసుకెళ్తున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న నివాసాలు ఉండే ప్రజలు సైతం ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పెరిమిటిపాడు చెరువులో వారం రోజుల నుంచి మట్టిని తవ్వి సమీపంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. ఇక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు ఒక్కటై చెరువుతో పాటు పక్కనే ఉన్న జగనన్న లే అవుట్, ఫారెస్టు భూముల్లో కూడా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో దొరికే మట్టికి మంచి గిరాకీ ఉండడంతో అక్కమార్కులకు వరంగా మారింది. ఈ చెరువులో పక్కనే ఉన్న దేవాలయానికి రోడ్డు వేసేందుకు మట్టిని తోలుకుంటున్నామని చెప్పి పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తున్నారు. కొంతమంది నాయకులు



అటవీ భూముల్లో తవ్వేసిన మట్టి

ప్రతీ ట్రిప్పునకు రూ.100 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇంతలా మట్టి తవ్వేస్తున్నా.. రాత్రిళ్లు ట్రాక్టర్లు తెగ తిరుగుతున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.

తలకోన ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న బీఆర్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంగళవారం ఉదయం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ భూమి పూజ చేశారు. ఈ ఆలయ అభివృద్ధికి టీటీడీ రూ.18 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఏడాదిలోపు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించామని బీఆర్ నాయుడు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో సుందరంగా ఈ ఆలయ పునర్నిర్మాణంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే నాని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు శాంతారావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, తలకోన ఆలయ ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులు వణికించి బోనుకు చిక్కిన చిరుత

మంగళం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు సోమవారం బోనుకు చిక్కింది. నెల రోజులుగా వర్సిటీ పరిసర ప్రాంతాల్లో శునకాలను వేటాడుతూ జూపార్కు రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసింది.



దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారులు చిరుత సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించారు. యూనివర్సిటీలో చిరుత సంచరిస్తున్న మూడు ప్రాంతాల్లో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు వర్సిటీలోని ఆడిటోరియం వద్ద గల అన్నపూర్ణ క్యాంటీన్ వెనుకవైపు ఏర్పాటు చేసిన బోనుకు చిరుత చిక్కింది. దీంతో యూనివర్సిటీ విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడ్డ మగ చిరుత వయసు మూడు సంవత్సరాలు ఉంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చిరుతను సురక్షితంగా సుదూర అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు ఆయన తెలిపారు.

29 బార్లకు నోటిఫికేషన్

● గతంతో పోలిస్తే రెండు అదనం

● దరఖాస్తుకు 26వ తేది గడువు

● ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీసీ విజయశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 29 బార్ల ఏర్పాటుకు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. గతంలో టూరిజం విభాగం బార్‌తో కలిపి 27 ఉండగా.. ఈసారి సూళ్లూరుపేట, తిరుపతి పరిధిలో రెండు అదనంగా ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 17, శ్రీకాళహస్తిలో మూడు, పుత్తూరులో ఒకటి, చంద్రగిరి టూరిజం కింద ఒకటి, గూడూరులో మూడు, సూళ్లూరుపేటలో రెండు, వెంకటగిరి, నాయుడుపేటలో ఒక్కోటి చొప్పున 29 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్, ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో సోమవారం వీరు నూతన ఎక్సైజ్ పాలసీపై మీడియాతో మాట్లాడారు. 'ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో 26న సాయంత్రం 5 గంటల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో https://oc.hpfs project.com ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు చేస్తేనే లాటరీ ద్వారా లక్కీ డిప్ తీసి లైసెన్సు కేటాయిస్తారు. ఒక్కో దరఖాస్తుకు నాన్ రీఫండబుల్ ఫీజు కింద రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10 వేలు చెల్లించాలి. ఈ దరఖాస్తులను 28న కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి అర్హులకు బార్లు కేటాయిస్తాం. సెప్టెంబరు ఒకటి నుంచి కొత్త బార్ పాలసీ అమల్లోకి వస్తుంది' అని వారు అని వివరించారు.

అప్పుడు వేలం.. ఇప్పుడు లాటరీ

ఈ బార్ల కేటాయింపునకు వైసీపీ ప్రభుత్వం వేలం పాట నిర్వహించగా, కూటమి ప్రభుత్వం లాటరీ విధానాన్ని అనుసరిస్తోంది. గతంలో ఈ- వేలం పాటల్లో రూ.కోటి వరకు పలికిన ఒక్కో బార్ లైసెన్సు.. ఈసారి కొత్త పాలసీ ప్రకారం లాటరీ ద్వారా రూ.55 లక్షలకే దక్కనుంది.

'గీత' కార్మికుల బార్లకు రేపు నోటిఫికేషన్

జిల్లాలో 'గీత' కార్మికుల కోసం మూడు బార్లు కేటాయించారు. వీటికి 20వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందులో తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఈడిగ సామాజికవర్గానికి ఒకటి, శ్రీకాళహస్తి, గూడూరులో గౌడలకు ఒక్కోటి చొప్పున బార్లను కేటాయించారు.

జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం





క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేస్తున్న రవినాయుడు, రజని - వెయిట్ లిఫ్టింగ్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో సోమవారం అమరావతి చాంపియన్‌షిప్-2025 జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని, రాష్ట్రవ్యాప్తంగా మూడు దశలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి పోటీలు ముగియగా, జోనల్‌స్థాయి పోటీలు మొదలయ్యాయి. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల నుంచి 1,700 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. ఈ పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఎన్డీయే ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి పాఠశాలకూ రూ.30వేలతో క్రీడా సామగ్రి అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి పతకాలు సాధించాలని శాప్ డైరెక్టర్ రజని కోరారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఏపీ జీబీసీ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఎస్వీయూ ఎస్ఐ కృష్ణయ్య, డీఎస్‌డీవోలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి బాస్కెట్ బాల్, ఖోఖో, పరుగుపందెం, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీలు జరిగాయి.



బాస్కెట్‌బాల్ పోటీలు

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

● ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీస్

తిరుచానూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండయ్యారు. మరో ముగ్గురు పోలీస్ అధికారులకు షోకాజ్ నోటీసు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్ (ఎమ్మెల్యే నాని నివాసం) సమీపాన ఐదు రోజుల కిందట రాత్రి వేళ ఓ వ్యక్తి వచ్చాడు. కుటుంబ సభ్యులతో వివాద నేపథ్యంలో అతడు ఆత్మహత్య చేసుకునేందుకు పెట్రోలు బాటిల్ తెచ్చుకున్నాడు. కాసేపు హడావిడి చేశాడు. అక్కడి భద్రతా సిబ్బంది గమనించి అతడి ప్రయత్నాన్ని నివారించారు. వెంటనే తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా, హెడ్‌కానిస్టేబుల్ సుజాత సరైన రీతిలో స్పందించలేదు. ఆ ప్రాంతం తమ పరిధికాదని,ఎమ్మార్‌పల్లి స్టేషన్ అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఈ విషయాన్ని పోలీస్ అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లినట్లు తెలిసింది. విచారించిన అధికారులు రెండు రోజుల క్రితం సదరు హెడ్‌కానిస్టేబుల్ సుజాతను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ముగ్గురు అధికారులకూ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



భాకరాపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మొలక రాధాకృష్ణ, తిప్పిరెడ్డి గారిపల్లె, చిన్నగొట్టిగల్లు గ్రామస్తులు కలసి ఈఆలయాన్ని నిర్మించారు. ఆదివారం రాత్రి నుంచి వివిధ పూజాది కార్యక్రమాలు జరిగాయి. సోమవారం ఉదయం హోమాలు నిర్వహించాక ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అన్నదానం చేశారు.

పేదల భూ సమస్యలను పరిష్కరించండి



గుణశేఖర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న సీపీఐ నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పేదల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ గుణశేఖర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పేదల భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గతంలో 70 మంది ఆటో కార్మికులకు ఇంటి పట్టాలు ఇచ్చినా ఇప్పటి వరకు స్థలాలు చూపించలేదన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆటో కార్మికులకు ఇంటి స్థలాలు చూపిచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు రాజా, ఉమాపతి, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కరీంతుల్లాబాద్ వాసులు

పాకాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ శివాజీనగర్, కరీంతుల్లాబాద్, శ్రీనివాసపురంలలో ప్రభుత్వ భూమి కబ్జాచేసి ఓ వ్యక్తి విక్రయించుకుంటున్నాడని ఆ ప్రాంతవాసులు సోమవారం తహసీల్దార్ సంతోష్‌సాయికి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసపురం (కరీంతుల్లాబాద్)లో నివాసమున్న ఓ వ్యక్తి ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని ఇటీవల చదును చేసి ప్లాట్‌లు వేసి విక్రయిస్తున్నాడన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణంకోసం దాత ఇచ్చిన స్థలాన్ని తన కుటుంబ సభ్యుల పేరుతో అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నాడన్నారు. గృహాల నిర్మాణాల కోసం పేదలకిచ్చిన స్థలాలను కూడ ఆక్రమించుకుని వేరే సర్వే నెంబర్లతో పలువురికి విక్రయించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై విచారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసినవారిలో డి.సురేష్, ఎన్.హరిప్రసాద్, రావిళ్ల మోహన్, కె.రాజేంద్ర, సుబ్బు తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్స్ మహాసభపై కరపత్రాల విడుదల

పాకాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు మధుసూదన్‌రావు కోరారు. ఆటో డ్రైవర్‌లతో కలిసి సోమవారం దామలచెరువులో కరపత్రాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో మహాసభ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం ఆటో డ్రైవర్ల జీవితాలకు ఉరితాడుగా మారుతోందన్నారు. దండపాణి, మురళి, షరీఫ్, మస్తాన్ పాల్గొన్నారు.

మ్యాంగో లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



సర్టిఫికెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాకాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు మ్యాంగో లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం లయన్ సీవీ భానుమూర్తి రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా జి.రెడ్డిబాషా, కార్యదర్శిగా జి.నాగూర్ బాషా, ట్రెజరర్‌గా నిజాముద్దీన్‌లు ఎన్నికయ్యారు. నూతన సభ్యులుగా ఎస్.ఇమ్రాన్, అన్సర్ చేరారు. అనంతరం పేదలకు బెడ్‌షీట్‌లను పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ టైలరింగ్‌లో శిక్షణ పొందిన 47 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ కె.రాజారెడ్డి, ప్రిసైడింగ్ అధికారి పి.నాగూర్ బాషా, రీజినల్ ఛైర్‌పర్సన్ జి.రామయ్య, కెఎస్.మస్తాన్, ఆర్వీ ప్రసాద్, కె.యాసానుల్లా, కె.సైదుల్లా, మాధవి, వేణుగోపాల్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విశ్వశాంతి మహాయాగం



తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో రెండవరోజు సోమవారం శ్రీశ్రీనివాస విశ్వశాంతి మహాయాగం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తుల ఐశ్వర్యం, ఆయురారోగ్య సంపదలు కాంకిస్తూ ఈ యాగాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. 32 మంది వేదపండితులు పారాయణాన్ని వైభవంగా చేపట్టారు.

వైభవంగా వేణుగోపాలుడి ఊరేగింపు



రామచంద్రాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుపేట లోని రాధ, రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి మేళతాళాల నడుమ పుష్పపల్లకీలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. గ్రామస్థులు మంగళహారతులు ఇచ్చి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

జలకంఠేశ్వరస్వామికి తిరుమంజనం



రామచంద్రాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట కోటిలింగేశ్వరాలయ పుష్కరణిలో నిర్మితమైన జలకంఠేశ్వరస్వామికి సోమవారం వైభవంగా తిరుమంజనం జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించిరు. ఉదయం మృత్యుంజయ హోమం ప్రారంభించి పూర్ణాహుతితో ముగించారు. పుష్కరణి చుట్టూ రూ.2లక్షలతో కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన అబ్బూరి దేవరాజులునాయుడు గ్రిల్స్‌ను ఏర్పాటుచేశారు. ఉభయదాతలుగా సినీ దర్శకుడు నందకిశోర్ కుటుంబసభ్యులు, కఠారి భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

తగ్గుతున్న స్కూళ్ల సంఖ్యపై అధికారులు ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రావారిపాలెం,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో పాఠశాలల సంఖ్య తగ్గుతుండటంపై జిల్లా విద్యాశాఖాధికారులు సోమవారం ఆరా తీశారు. ఈ విషయమూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వారు దృష్టిసారించారు. ఎంఈవోలు బాల సుబ్రమణ్యం, సతీస్‌లతో మాట్లాడారు. ఉస్తికాయల పెంట, మెదర పల్లె, కుమ్మర పల్లెలో 40 వరకు పిల్లలున్నా ఎందుకు విలీనం చేయాల్సివచ్చిందో తెలుసుకున్నట్లు సమాచారం. పేద వర్గాలు, గిరిజనులు, దళితులున్న ప్రాంతాల్లో వీలీన చర్యల ఫలితంగా 3,4,5 తరగతుల్లో కొంత మంది పిల్లలు చేరలేదని అధికారులు గుర్తించారు. పూర్తి వివరాలు పంపాలని కోరినట్లు తెలిసింది.

చంద్రగిరి

పొలంలో విద్యుత్ వైర్ల చోరీ

చంద్రగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తొండవాడకు చెందిన జగన్మోహన్‌నాయుడి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావి విద్యుత్ వైర్లు చోరీ చేశారు. బాధితుడి కథనం మేరకు పొలంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని కొందరు మద్యం తాగుతున్నారు. జగన్మోహన్‌నాయుడి తల్లి చూసి మందలించింది. వారు తిరగబడటంతో ఆమె ఇంటికి వెళ్ళిపోయింది. తర్వాత జగన్మోహన్‌నాయుడు వచ్చి చూడగా విద్యుత్ వైర్లను చోరీ చేసినట్లు గుర్తించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్షాలకు తెగిపడిన ట్రాన్స్‌ఫార్మర్

రామచంద్రాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం రాత్రి పడిపోయింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ దిగువ దిమ్మె భూమిలోకి దిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం నుంచి ఊడిపడి కింద పడింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చింతగుంట ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఎర్రావారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చింతగుంట గ్రామ పంచాయతీ పసుపులేటి పల్లె వద్ద చింతగుంట ఎల్లమ్మ గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ఠ బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. గ్రామనికి చెందిన దాత కంచన గుణశేఖర్‌రెడ్డి ఆలయాన్ని నిర్మించారు. ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు పరిసర గ్రామ ప్రజలు సంఖ్యలో హజరయ్యారు.

ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

పాకాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి, కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండు చేశారు. విద్యార్థులతో కలిసి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సంతోష్‌సాయికి వినతి పత్రం అందజేశారు. పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించిన సొంత భవనాలు నిర్మించలేదన్నారు. జూనియర్ కళాశాలలోనే అరకొర వసతులతో చాలిచాలని గదులలో బోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు, క్రీడాస్థలం లేకపోవడం దారుణమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు ప్రకాష్, శివ, సునీల్, రంజిత్, మనోజ్, సుదర్శన్, జగదీష్, సమీర్, చందు, షాజహాన్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

మేకల ఆవాసంగా కమ్యూనిటీ హాల్



చంద్రగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అగరాలలో ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ మేకలకు అడ్డాగా మారింది. దీనిపై ఎంపీడీవో వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శిలకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తుడా నిధులతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించారు. గ్రామానికి చెందిన ఓవ్యక్తి దీనిని మేకల షెల్టర్‌గా మార్చుకున్నాడు. దీనిపై వెంటనే చర్యలు తీసుకొంటామని పంచాయతీ కార్యదర్శి సుజాత తెలిపారు.

తాళమున్నా లాకర్‌లోని బ్యాగు మాయం

తిరుమల, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తాళమున్నా లాకర్‌లోని బ్యాగు మాయకావడంతో భక్తులు అవాక్కయ్యారు. విశాఖపట్నానికి చెందిన బాధితుల వివరాల మేరకు.. శశికుమార్, వసంత దంపతులు, గోవింద, శంకుత దంపతులు ఈనెల 16వ తేదీ వేకువజామున తిరుమల వచ్చారు. యాత్రికుల వసతి సముదాయం-3 లోని లాకర్‌ను అద్దెకు తీసుకున్నారు. 3సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు, దుస్తులు ఉన్న బ్యాగును లాకర్‌లో పెట్టి తాళం వేశారు. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు వచ్చి లాకర్ తాళం తెరిచి చూస్తే బ్యాగ్ కనిపించలేదు. వెంటనే విజిలెన్స్ అధికారులకు తెలియజేశారు. ఓ వ్యక్తి లాకర్‌ను తన వద్దనున్న తాళాలతో తెరిచి బ్యాగును అపహరించి తిరిగి తాళం వేసిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డయింది. సెల్‌ఫోన్లు, నగదు అపహరించి ఖాళీ బ్యాగును మెట్లపక్కనే పడేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ వీఎస్వో సురేంద్ర మాట్లాడుతూ..పోలీసులతో మాట్లాడి త్వరలోనే దొంగను పట్టుకుంటామన్నారు.

ఎరువుల కొరత రాకుండా చర్యలు



రామకృష్ణమనాయుడిని సన్మానిస్తున్న పవన్‌కుమార్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణమనాయుడు చెప్పారు. కలెక్టరేట్‌లోని ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వ్యవసాయశాఖతో సమన్వయం చేసుకుంటూ సొసైటీ, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులను పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా, 850 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు గోదాములో నిల్వ ఉన్నాయన్నారు. జిల్లాలో ఈసారి వరి కోత పనులు త్వరగా మొదలవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఆయన్ను మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్ సన్మానించారు.

వేదోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుం జయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు చేశారు. పలు అభిషేకాలు చేశారు. హారతులు సమర్పించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చూసి వెళతారా? సమస్యలు పరిష్కరిస్తారా?

శ్రీవారి దర్శనానంతరం స్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి (సెంట్రల్), ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేకి ఎందరో జనరల్ మేనేజర్లు వచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టాక తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తారు. తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య, స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు సంబంధించి వివరాలు తెలుసుకుంటారు. సమస్యలు వింటారు. అంతే.. అక్కడితో సరి. ఆ తర్వాత బదిలీపై వెళ్లే సమయంలో.. దక్షిణ మధ్య రైల్వే జీఎంగా చివరి రోజుల్లో మళ్లీ వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళుతున్నారు. ఈ మధ్య కాలంలో సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలున్నాయి. తాజాగా దక్షిణ మధ్య రైల్వే జీఎంగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ కుమార్ శ్రీవాత్సవ తిరుమలకు వస్తున్నారు. ఈ క్రమంలో గత అధికారుల్లా చూసి వెళతారా? సమస్యలపై స్పందిస్తారా? అన్నది రైల్వే వర్గాలు, ప్రయాణికుల్లో చర్చగా మారింది.

జీఎం సారూ.. ఇవీ సమస్యలు

- రేణిగుంట రైల్వే స్టేషన్ రోడ్డు నెంబరు ఒకటి(ప్లాట్ ఫారం ఒకటి) నుంచి గూడూరు వైపు వెళ్లే రైలు మార్గాన్ని కలుపుతూ చేపట్టవలసిన రైలు మార్గం అనుసంధానం పనులు 20 ఏళ్లుగా పూర్తి కాలేదు. దీంతో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేక రాత్రి సమయాల్లో పోలిమేర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అనుసంధాన పనుల కోసం అప్పట్లో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంటోంది.
- రేణిగుంటసంత వద్ద ఎల్‌సీ గేటు నెంబరు (112) స్థానంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదు.
- పద్మావతి ఫ్లోర్ మిల్లు ఎదుట వున్న ఎల్ సీగేటు(109), హీరో హోండా ఎదుట ఉన్న ఎల్‌సీ గేటు(107) వద్ద జరుగుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి.
- బుగ్గవీధి నుంచి భగత్ సింగ్ కాలనీ, ఇతర కాలనీల్లోకి అండర్ బ్రిడ్జి నిర్మించాలి.
- తిరుచానూరు రైల్వేస్టేషన్ నిర్మాణాలు ఎప్పటికి పూర్తయి.. ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి.
- పడమటి రైల్వేస్టేషన్ వద్ద రేల్ కళ్యాణ్ మండపం నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయి?
- పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా ప్రత్యేక రైళ్లు పెరుగుతున్నా, రైళ్ల నిర్వహణలో నాణ్యతాప్రమాణాలు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రత్యేక రైళ్లకు పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది.
- మహిళా ఉద్యోగులకు తగిన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయలేదు.
- రెండు నెలల కిందటే అప్పగిస్తామని చెప్పినా.. ఇప్పటికీ దక్షిణం వైపు చేపట్టిన నూతన భవనం పనులు పూర్తి కాలేదు.
- రేణిగుంట రైల్వే స్టేషన్‌లో మరో రెండు ప్లాట్ ఫారాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.
- తిరుపతి పడమర రైల్వే స్టేషన్‌లో రైళ్లను పార్కింగ్ చేసి సమస్యను పరిష్కరించే అవకాశమున్నా ఈ దిశగా చర్యలు చేపట్టడంలేదు.

రేపు రైల్వే నూతన జీఎం పర్యటన



సంజయ్ కుమార్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ సికింద్రాబాద్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడ నుంచి తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకొని 9.30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు వచ్చి స్టేషన్ దక్షిణం వైపు నిర్మిస్తున్న నూతన భవనాన్ని పరిశీలిస్తారు. 11గంటలకు రేణిగుంటలో బయలుదేరి గుంతకల్లు వరకు విండో తనిఖీలు నిర్వహిస్తారు. గుంతకల్లులో సమీక్షిస్తారు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు బయలుదేరి సికింద్రాబాదుకు చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

తలకోన ఆలయాన్ని ఆధునికంగా తీర్చిదిద్దుతాం



భూమిపూజకు హాజరైన టీడీపీ శేణులతో ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎర్రావారిపాలెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తలకోనలో సిద్దేశ్వరస్వామి ఆలయ నూతన నమూనాను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. రూ.18కోట్లతో నిర్మించ తలపెట్టిన ఈ ఆలయ భూమి పూజ జరిగిన క్రమంలో కొత్త నిర్మాణ విశేషాలను ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయనకు వివరించారు. ఇపుడున్న ప్రాంగణంలోనే కొత్త నిర్మాణం జరుగుతుంది. పోటు,ఆలయ కార్యాలయం, గణపతి, సుబ్రమణ్యస్వామి, అంజనేయ స్వామి గుడుల నిర్మాణం గురించి తెలియజేశారు. ఆధునికతో శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా దేవాలయం రూపుదిద్దుకుంటుందన్నారు. భూమి పూజోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు, పార్టీ శేణులకు ఎమ్మెల్యే పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిజేశారు.

నందమూరి, నారా కుటుంబాలు టీడీపీకి రెండు కళ్లులాంటివి

● శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి సంబంధించి నందమూరి, నారా కుటుంబాలు రెండు కళ్లలాంటివని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం తెలిపారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ ఇద్దరూ ఎన్టీఆర్ మనవళ్లేనని, ఒకరు సినిమాల్లో, మరొకరు రాజకీయాల్లో ఉన్నారన్నారు. భవిష్యత్తులో వారిద్దరూ కలిసి రాజకీయాలు చేస్తారని జోస్యం చెప్పారు. వార్ 2 సినిమాను ఆడనివ్వబోమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యల గురించి అడగ్గా అది తన వాయిస్ కాదని ఆయన వివరణ ఇచ్చారని, అయినా కూడా క్షమాపణ చెప్పారన్నారు.

ఇదే విషయమై మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ జైలుకు వెళ్లే ముందు ఇలాంటి మాటలే వస్తాయని ఎద్దేవా చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో దాదాపు రూ.127కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని తేలిందని, ప్రభుత్వానికి నివేదిక అందించామని, త్వరలోనే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 16 బహుళజాతీయ కంపెనీలలో 530కి పైగా ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 5వ తరగతిపైన, పదవ తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత అయిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బుధవారం స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 9985056929, 8639835953లను సంప్రందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు దేవేందర్‌రెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్మాండ్, డీఆర్‌డీఏపీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు. కాగా, ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దోమల నివారణ దినోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై బ్లాక్‌మెయిల్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డబ్బు కోసం తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ తిరుపతిలోని శ్రీరమాదేవి ఆస్పత్రికి చెందిన మెడికల్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'తిరుపతి వార్త' పక్షపత్రిక జర్నలిస్టు మాచర్ల శ్రీనివాస్‌పై వెస్ట్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. 'ఈనెల 10 వ తేదీన ఆస్పత్రికి వచ్చి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు.

ఆ మొత్తం ఇవ్వకుంటే ఆస్పత్రికి వ్యతిరేకంగా వార్త రాస్తానంటూ బెదిరించారు. తాము డబ్బు ఇవ్వకపోవడంతో ఆర్టికల్ రాసి వాట్సాప్‌ఎలో పంపారు. ఆ తర్వాత పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఇతడు గతేడాది కూడా రూ.30 వేలు అడిగారు. తాము రూ.మూడు వేలు పంపగా.. వెనక్కి పంపేశారు. ఆ తర్వాత ఆయన చేతికి రూ.30 వేలు ఇచ్చాం' అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాళెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... వేముల పాళెం గ్రామానికి చెందిన శివయ్య అనే వృద్ధుడు సైకిల్‌పై గూడూ రుకు వెళ్తుండగా పాతసంతరోడ్డు వద్ద ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొంది. శివయ్యకు గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అయినా, అప్రమత్తంగా ఉండాల్సిందే

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో చిరుత బోనుకు చిక్కినా.. విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగానే ఉండాలని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. చిరుతను బంధించి యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగుల్లో భయాన్ని తొలిగించిన అటవీశాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మూడు వారాలుగా చిరుత అందరినీ భయపెట్టిందని చెప్పారు. అలిపిరి, వేద వర్సిటీ మీదుగా ఎస్వీయూకు చిరుత వచ్చీ వెళుతూ ఉండేదన్నారు. ఇటీవల బైకుపై వెళ్ళే వారిపై చిరుత దాడి చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో చిరుతను బంధించి అటవీ శాఖ అధికారులు అందరికీ ఉపశమనం కలిగించారని పేర్కొన్నారు. అయినా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటనలో ఎస్వీయూ అధికారులు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఏర్పేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు .. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌కు చెందిన పాళెం ప్రకాష్(29) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా మేర్లపాక వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ల్యాప్‌టాప్‌ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ఏర్పేడు, ఆగస్టు18, ఆంధ్రజ్యోతి: ఐఐటీ హాస్టల్లో ఉంటున్న పది మంది విద్యార్థులకు సంబంధించిన 10 ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. ఒక్కో దాని విలువ లక్షా 20వేలు ఉంటుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి విద్యార్థుల తల్లిదండ్రులుఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడి కేసులో వైసీపీ నేత అరెస్ట్

చిల్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వైసీపీ నేత వేమారెడ్డి కుమరస్వామి రెడ్డిని ఓ దాడి కేసులో సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మోమిడి గ్రామానికి చెందిన టీడీపీ నేత జాకీర్ మత్స్యకారులకు సంబంధించిన బోట్ల రిజిస్ట్రేషన్ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, విచారించి సరిచేయాలని మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి ప్రోద్బలంతో ఆయన అనుచరులైన కొంతమంది జాకీర్‌పై దాడి చేసేందుకు అతని ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో జాకీర్ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై జాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఈనెల 8వ తేదీన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దాడికి ప్రోత్సహించిన వైసీపీ నేత కుమారస్వామిరెడ్డిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

బిహార్‌లో దొంగ ఓట్లు- తిరుపతిలో కాంగ్రెస్ నేతల నిరసన





కాంగ్రెస్ నేతలతో కలిసి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్- కొవ్వొత్తులతో ర్యాలీ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లోలాగే బిహార్‌లోనూ దొంగ ఓట్లతో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనికి ఎన్నికల కమిషన్ సహకరిస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. బిహార్‌లో దొంగ ఓట్ల చోరీ ఆపాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బిహార్‌లో 65 లక్షల దొంగ ఓట్లు నమోదు చేశారన్నారు. ఇకనైనా ప్రజాస్వామ్య బద్ధంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రవి, వెంకటేష్‌గౌడ్, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

- అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కే భాగంగానే బిహార్‌లో దొంగ ఓట్లకు తెరలేపిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు విమర్శించారు. ఓట్ చోర్-గద్దె ఛోడ్ నినాదాలతో నగరంలోని గాంధీరోడ్డులో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాంభూపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, మురళీకృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

పీ4లో భాగస్వాములుకండి

● వైద్యులకు కమిషనర్ పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4లో బంగారు కుటుంబాలకు వైద్యులు మార్గదర్శకులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), అప్నా నిర్వహించిన సీఎంఈ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ పేదలు లేని సమాజం ఏర్పాటు కోసం ప్రభుత్వం పీ4 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు వైద్యులు సహకరించి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తామని వైద్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, అప్నా అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, సీనియర్ వైద్యులు డాక్టర్ వెంగమ్మ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జనార్దన్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

భక్తుడిని కాపాడిన కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుండెపోటుతో కుప్పకూలిన తెలంగాణా భక్తుడికి సీపీఆర్ చేసి, ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ జి.గుర్రప్ప ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం తన చాంబర్‌లో సన్మానించారు. రూ.2వేలు నగదు రివార్డు అందచేశారు. తిరుమల వన్‌టౌన్ స్టేషన్ కానిస్టేబుల్ జి.గుర్రప్ప ఈనెల 15న రాత్రి లడ్డు కౌంటర్ వద్ద విధులు నిర్వహిస్తుండగా తెలంగాణా రాష్ట్రం మమ్మిడిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే స్పందించిన గుర్రప్ప అతనికి సీపీఆర్ చేసి తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. గుర్రప్ప స్పందించిన తీరును ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ వెంకట్రావు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



భానుప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఉషమ్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. భానుప్రకాష్‌రెడ్డి తల్లి అరుణమ్మ ఇటీవల మరణించడంతో సోమవారం తిరుపతి శాంతినగర్‌లోని ఆయన స్వగృహానికి వచ్చిన ఉషమ్మ అరుణమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చేనేత హస్తకళ ప్రదర్శన ప్రారంభం



కొయ్యతో తయారుచేసిన దేవతా ప్రతిమలను వీక్షిస్తున్న హరిప్రసాద్

తిరుపతి అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాయల్ చేనేత హస్తకళ ప్రదర్శనను ఏపీ హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. స్టాల్స్‌ను సందర్శించారు. పలు రకాల వస్తువులను ఒకే వేదికపైకి తీసుకురావడాన్ని అభినందించారు. చేతివృత్తుల వస్తువులు, దుస్తులు, కొయ్య, మట్టి బొమ్మలు, తినుబండారాలను సరసమైన ధరలకే విక్రయించడాన్ని ప్రశంసించారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జగన్మోహన్, శ్రీకాంత్, జన సైనికులు కీర్తన, మధుబాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు తిరుపతి బాలిక



ట్రోఫీ అందుకుంటున్న త్రిపురాంబిక

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి చదరంగం పోటీలకు తిరుపతికి చెందిన త్రిపురాంబిక అర్హత సాధించింది. ఈ నెల 16న కాకినాడలో జరిగిన ఏపీ స్టేట్ అండర్-17 ఓపెన్ అండ్ గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో ఆమె ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ట్రోఫీ, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకుంది. త్వరలో జరగబోవు జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

● ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు



సీఎండీని కలిసిన ఏపీ జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నామని సీఎండీ కె.సంతోషరావు అన్నారు. సోమవారం ఏపీ జనశక్తి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సదరన్ డిస్కం కార్యాలయంలో సీఎండీని మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం సభ్యుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలోని అన్ని గుర్తింపు సంఘాల నాయకుల వినతుల మేరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నామని సీఎండీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు ఎ.సుధాకర్, టి.అశోక్‌కుమార్, డిస్కం నాయకులు ఎ.శ్రీనివాసరాజు, శ్రీరాం మల్లికార్జున, పి.సోమశేఖర్, ఐ.వెంకటాద్రి, టి.పోతులయ్య, జి.సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గంగావతరణ ఘట్టం



గంగావతరణం ఘట్టాన్ని వినిపిస్తున్న శబరి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రామచంద్ర పుష్కరిణిలోని కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం జరిగిన గంగావతణం ఘట్టం ప్రవచనం ఆకట్టుకుంది. టీటీడీ హిందూ ప్రచార పరిషత్ పురాణ ప్రవచనాలు, హరికథా కళాకారుడు బి.శబరి రామాయణంలోని గంగావతరణం ఘట్టాన్ని వినిపించారు. కళాక్షేత్రం ప్రోగ్రాం ఆఫీసర్ జె.పద్మ పర్యవేక్షించారు.

బాధ్యతగా ప్రజా సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారాన్ని బాధ్యతగా భావించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. పీజీఆర్ఎస్‌లో భాగంగా సోమవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 72 వినతులు వచ్చాయి. నెలల తరబడి పరిష్కారం కాని వినతులను తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచారి, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో నలుగురికి జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు నాలుగవ జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.40వేలు జరిమానా విధించారు.

చిరు వ్యాపారుల సమస్యలు పట్టించుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు చిరు వ్యాపారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏడాది నుంచి దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పేర్కొన్నారు. స్థానిక యశోదానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన చిరు వ్యాపారుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాతికేళ్లుగా యాత్రికులను నమ్ముకుని శ్రీవారిమెట్టు వద్ద 30 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. అక్కడ వ్యాపారాలు చేయకూడదని ఆంక్షలు విధించి, తరిమేయడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. ఈనెల 21వ తేదీకి వారు ఆందోళన చేపట్టి ఏడాది పూర్తి కావస్తోందని, టీటీడీ పాలకమండలి, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చిట్టిబాబు, మధు, చిరంజీవి, రాంబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీనియర్ జర్నలిస్టు ఫోరం మహాసభలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు సీనియర్ జర్నలిస్టు ఫోరం జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర వెటరన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జనార్దన్, నరేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ స్కీమ్, హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి తీర్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐగాట్ కర్మయోగి శిక్షణతో ఉద్యోగులకు మరింత సామర్థ్యం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఐగాట్ కర్మయోగి శిక్షణతో ప్రభుత్వ ఉద్యోగులు వారి నైపుణ్యాలను రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చేసుకోవడంతోపాటు ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందించవచ్చని ఈఎస్ఐసీ జేడీ రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఈఎస్ఐసీ కార్యాలయంలోని అధికారులకు, సిబ్బందికి సోమవారం ఐగాట్ కర్మయోగి శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఐగాట్ కర్మయోగి డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారా ఉద్యోగుల్లో నైపుణ్యత, సామర్థ్యాలు పెరిగి పారదర్శకమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈఎస్ఐసీ అధికారులు ప్రణవ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు ఆయన సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కామరాజు సతీమణికి రూ.లక్ష, రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ అయ్యప్ప భార్య కల్పనకు రూ.లక్ష, రైలు ప్రమాదంలో మరణించిన అశోక్‌కుమార్ తండ్రి గోపాల్‌కు రూ.లక్ష అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న హెడ్ కానిస్టేబుల్ బి.రోశయ్యకు పోలీసు సంక్షేమ నిధి నుంచి వడ్డీ లేని రుణం కింద రూ.లక్ష అందజేశారు.

పేదలకు ఇంటి స్థలాలు కేటాయించండి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేసి, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పేదలకు రెండు, మూడు సెంట్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం నివాసానికి ఉపయోగపడటం లేదన్నారు. వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పేదవాడికీ న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం మూడు సెంట్ల చొప్పున స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ ఆందోళనలో నాయకులు విశ్వనాథ్, చలపతి, రవి, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యం, సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

భారతీయ సంస్కృతికి ఆగమాలు దర్పణం

● జాతీయ సదస్సులో వక్తల మనోభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ఆగమాలు దర్పణమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పాంచరాత్ర ఆగమాలపై సోమవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. సభాధ్యక్షత వహించిన సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆగమాలను కాపాడేందుకు సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పడిందన్నారు. ఆగమాల బోధన, పరిశోధన, విస్తరణ, పుస్తక ప్రచురణ, సదస్సులు, వర్క్‌షాప్‌ల నిర్వహణ ద్వారా ఆగమాల సంరక్షణకు సంస్కృత వర్సిటీ తనవంతు కృషి చేస్తుందన్నారు. ఆగమ శాస్త్ర ప్రయోగశాల త్వరలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మైలాపూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అరుణసుందరం మాట్లాడుతూ సాక్ష్యాత్తూ భగవంతునితో ఉపదేశించడం వేదాల ప్రత్యేకత అని చెప్పారు. వేద సదృశ్యములే ఆగమ శాస్త్రాలని పేర్కొన్నారు. పరమాత్మ సదృశములే ఆలయంలోని విగ్రహాలన్నారు. విగ్రహారాధన లోక సంక్షేమార్థం ఉద్దేశించినట్లు చెప్పారు. వైఖానస, పాంచరాత్ర, శైవ, తంత్రసార ఆగమాలు ఈ పూజా విధానాలను తెలియజేస్తాయన్నారు. వీటిపై మరింత లోతుగా అధ్యయనం సాగాలని అభిప్రాయపడ్డారు. టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని మాట్లాడుతూ ధర్మానికి మూలం వేదమన్నారు. వేదానికి ప్రయోగం ఆగమం అన్నారు. ఆగమమే సర్వ శాస్త్రాలకు మూలమన్నారు. అన్ని ఆగమాల సారం దేవుడి దర్శనమేనని అభిప్రాయపడ్డారు. యజ్ఞాలు, యాగాలు, తపస్సు ఆగమాలకు అనుబంధమైనవని తెలిపారు. సదస్సులో పాల్గొన్న అతిథులు, ప్రతినిధులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, సదస్సు కన్వీనర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 30 వినతులు



సమస్యను కమిషనర్ మౌర్యకు వివరిస్తున్న బాధితులు

తిరుపతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు వచ్చాయి. కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, అనిల్ తమ డివిజన్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిపురంలో డ్రైనేజీ నీరు ఇంట్లోకి వస్తున్నాయని, చిన్న బజారు వీధిలో సీసీ రోడ్లు వేయాలని, నిమ్మకాయల వీధి, టీకే స్ట్రీట్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, వికలాంగ పెన్షన్‌కు దరఖాస్తు చేస్తే అర్హులు కాదంటున్నారని, వితంతు పింఛను ఇప్పించాలని, మా స్థలాలను వేరే వ్యక్తి ఆక్రమించారని, న్యాయం చేయాలని అర్జీదారులు వినతులు సమర్పించారు. అలాగే కేకే లేఅవుట్‌లో తాగునీటిలో మురుగునీరు కలుస్తున్నాయని,కపిలతీర్థం కూడలి నుంచి అలిపిరి వెళ్లే మార్గంలో గుంతలు ఎక్కువగా ఉన్నాయని, తల్లికి వందనం జమ కాలేదని, తిమ్మినాయుడుపాళెంలో కొత్త రోడ్లు వేయాలని, సత్యానారాయణపురం, జీవకోన ప్రాంతాల్లో టిఫిన్ దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారని వినతులు వచ్చాయి. పరిశీలించిన కమిషనర్ మౌర్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, ఏసీపీ మూర్తి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు



విజేత చిత్తూరు జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచింది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో సోమవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కడప, చిత్తూరు మధ్య జట్ల పోరులో మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. శిరీష 50 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 17.2 ఓవర్లలో వికెట్ నష్టానికి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. 9వికెట్ల తేడాతో గెలుపొందిన చిత్తూరు ట్రోఫీని కైవసం చేసుకుంది. శుభశ్రీ 54 పరుగులు, హంస 23 పరుగులు చేశారు. మొదటి స్థానంలో చిత్తూరు, జట్టు ద్వితీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ సెలెక్టర్ ధనలక్ష్మి, జోన్ సెలెక్టర్లు రాధిక, వేదవల్లి, నాగమణి, అనూష, హరీషా పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత

తిరుపతి,(విద్య) ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదమునిరెడ్డి కోరారు. సోమవారం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్విమ్స్, రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంకుల సహకారంతో స్టూడెంట్ నేషన్ ఆధ్వర్యంలో రెండవ రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన నాదమునిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో రక్తం అవసరం బాగా పెరిగిందన్నారు. రహదారులపై జరిగే ప్రమాదాలు అనేక కుటుంబాలను క్షణాల్లో చిదిమేస్తున్నాయని తెలిపారు. అలాంటి సమయంలో రక్తదానం చాలా అవసరమన్నారు. ఇది నిజమైన దేశసేవ అవుతుందని పేర్కొన్నారు. 200 మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.రాజేంద్రశెట్టి, కార్యదర్శి ఎం.శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మాలతీ చందూర్ సాహిత్యంపై వ్యాసరచన పోటీలు


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఈనెల 21వ తేదీన 'మాలతీ చందూర్ సాహిత్యంపై ధర్మనిధి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాలతీ చందూర్ సాహిత్యంపై విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు చేపట్టారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాలతీ చందూర్ ధర్మనిధి సదస్సు డైరెక్టర్ వై.సుభాషిణి పర్యవేక్షించారు. విజేతలకు ఈనెల 21వ తేదీ మాలతీచందూర్ ధర్మనిధి సదస్సులో బహుమతులు ఇస్తామని డాక్టర్ సుభాషిణి తెలిపారు.



పోటీలను పర్యవేక్షిస్తున్న సుభాషిణి

గంగమ్మకు వెండి పట్టీల బహూకరణ





ఈవోకు వెండిపట్టీలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, దాత మహేష్ యాదవ్

తిరుపతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మకు టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి నైనారు మహేష్ యాదవ్, అనిత దంపతులు 450 గ్రాముల వెండిపట్టీలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా బహూకరించారు. వాటిని స్వీకరించిన ఆలయ ఈవో జయకుమార్ అమ్మవారి పాదాల దగ్గర ఉంచి పూజలు చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గంగమ్మ భక్తుల చేత పూజలందుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ. ఆరణి మదన్, చింతా భరణి యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్వీఎం శ్రీధర్, గంజి సుధాకర్ రెడ్డి, ఆముదాల వెంకటేష్, జానకిరామ్ రెడ్డి, సుబ్బు యాదవ్, నాగప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


గౌతమ్‌రాజు

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సినీ ప్రముఖుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, సీఎం సోదరి హైమావతి, సినీనటుడు గౌతమ్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉన్నారు.


ఆదిశేషగిరిరావు, హైమావతి

ఘాట్‌రోడ్డు పనుల పరిశీలన


తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు సుందరీకరణకు, శుభ్రతకు పలు సూచనలు చేశారు.


ఘాట్‌రోడ్డులో ఈవో శ్యామలరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 86,364
తలనీలాలు సమర్పించినవారు: 30,712



World Photography Day

అందాల విందు

ఫొటో అంటే సమాజానికి అద్దం కాదు, అర్థం. దృశ్యానికి ఛాయాచిత్రకారుడు చేసే కవితాత్మక వ్యాఖ్యానం. నమోదయ్యే ఒక చరిత్ర. కూలిన గోడ.. ఆశ్రయమిచ్చే నీడ.. రాలే చినుకు.. పేవ్‌మెంట్‌మీద కునుకు.. విరిసిన పువ్వు.. పసికందు నవ్వు.. కాదేదీ ఫొటోకనర్హం. శేషాచలం ఫొటోగ్రాఫర్లకు ఖజానా. ఆకుపచ్చని అందాలే కాదు.. పాకే పురుగు, ఎగిరే పిట్ట, దూకే జలపాతం.. సమస్తమూ ఛాయాచిత్రవస్తువే. అందుకు సచిత్ర సాక్ష్యమే ఈ ఫొటోలు. చిత్తూరు, తిరుపతి నగరాల్లో, తిరుమల కనుమ దారుల్లో తీసిన ఫొటోలు ఇవి. వాన కురిసే వేళ చిత్రవిచిత్రమైన బుల్లి జీవజాలాన్నీ, పర్యాటక ప్రదేశంలోని జనజీవితాన్నీ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఫొటోల విందు ఇది..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, తిరుపతి, తిరుమల, చిత్తూరు




ఎదురు చూపులు


నీళ్లొదిలానోచ్!


చీమల వంతెన


దిగులు వానలు


పహారా




లోపల ఏముందో

బుల్లి వింత జీవుల లోకం






తడిచిన బతుకులు












స్వామిదే.. భారం!



పార్టీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారు?

● కలెక్టర్, ఎస్పీలకు సత్యవేడు ఎమ్మెల్యే ఫిర్యాదు

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారంటూ సస్పెన్షన్‌లో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా తాను అభివృద్ధి పనులను ప్రారంభించాక, ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టాక మరొకరు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తాను పాల్గొనే కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొనవచ్చు గానీ విడిగా కార్యక్రమాలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆరోపించారు. పార్టీ కో ఆర్డినేటర్ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైనా మండల స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. తన ఫిర్యాదుపై స్పందించకుంటే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అందరూ భాగస్వాములై నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సత్యవేడులో టీడీపీ కో ఆర్డినేటర్‌కు పోలీసు విభాగం తరపున ప్రొటోకాల్ ఎలా కల్పిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీ హర్షవర్ధరాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన పెళ్లిళ్లు, ఆలయాలకు వెళుతున్నా మీ పోలీసులు వెంట వెళుతున్నారని చెప్పారు. దీనిపై పరిశీలించి ఎలా చేయాలో అలా చేస్తానని ఎస్పీ చెప్పారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రహరీ దూకి.. సీసీ కెమెరాలు పగులకొట్టి

● టీటీడీ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ

● 220 గ్రాముల నగలు, 460 గ్రాముల వెండి వస్తువుల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రహరీ దూకారు. ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలు పగులకొట్టారు. టీటీడీ (తిరుమల వైకుంఠం-1) సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడి 220 గ్రాముల బంగారు నగలు, 460 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. తిరుపతి క్రైం సీఐ ప్రకాష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి బైరాగిపట్టెడలో నివాసం ఉంటున్న టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఈనెల 14న హైదరాబాదులోని కుమార్తె ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి ఇంటికి రాగా.. తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చింది. బీరువాలో చూడగా బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్, క్రైం సిబ్బంది సంఘటనా స్థలం పరిశీలించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావుకు సమాచారం ఇచ్చారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు చిన్నపెద్దయ్య, ప్రకాష్‌బాబు, ఐడీ పార్టీలు, వేలి ముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు ఇంట్లో పరిశీలించాయి. వేలి ముద్రలు సేకరించారు.

ఇంట్లోనే బీరువా తాళాలు

హైదరాబాదుకు వెళ్లే సమయంలో శ్రీనివాసులు కుటుంబీకులు రెండు బీరువాలకు తాళాలు వేసి అక్కడే ఉంచారు. దీంతో దొంగలు ఆ తాళాలు తీసుకుని బీరువా తలుపులు తీసి 220 గ్రాములు బంగారు నగలు, 460 గ్రాములు వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. ఆ తాళాలూ తమతో పాటే వారు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు పగులకొట్టినా, వీధిలోని సీసీ కెమెరాల ఆధారంగా క్రైం పోలీసులు ఫుటేజీలను పరిశీలించారు. దొంగలు ఆటోలో వచ్చి.. వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ముఖాలు గుర్తు పట్టినట్లు విశ్వసనీయ సమాచారం. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.


దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న క్రైం డీఎస్పీ

పింఛను తొలగిస్తామంటున్నారు

అధికారుల ఎదుట బోరుమన్న దివ్యాంగులు - కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 238 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మేమంతా దివ్యాంగులం... ఇదే సదరం సర్టిఫికెట్లతో ఎన్నో ఏళ్లుగా పింఛను పొందుతున్నాం. ఇప్పుడేమో అనర్హులంటూ అధికారులు నోటీసులు పంపిస్తున్నారు అంటూ పలువురు దివ్యాంగులు అధికారుల ఎదుట బోరుమన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 238 వినతులు వచ్చాయి. అందులో భూసమస్యలపైనే 130 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పింఛను నిలిపేస్తే ఎలా బతకాలి?



నేను దివ్యాంగురాలిని. నడవలేని పరిస్థితిలో ఉన్నాను. వెరిఫికేషన్ పేరుతో సదరంలో వికలత్వం తక్కువ శాతం ఉందని పింఛను ఇవ్వమని అధికారులు అంటున్నారు. ఇది చాలా అన్యాయం. వీల్‌చైర్ లేకుండా నడవలేను. పింఛను లేకపోతే నేను ఎలా బతకాలి చెప్పండి.

- అరుణ, ఎస్కేడీనగర్, తిరుపతి

దివ్యాంగుల కోటాలో ఉద్యోగం ఇప్పించండి



అయ్యా నేను మనిషి సాయం లేకుండా నడవలేను. ఎంబీఏ వరకు చదివాను. దివ్యాంగుల కోటాలో ఉపాధి కల్పిస్తే ఆధారంగా ఉంటుంది. సాయం చేయండి.

- సాయి భాస్కర్, శ్రీకాళహస్తి

శంకరంబాడి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి

మహాకవి శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయన విగ్రహాన్ని లక్ష్మీపురం సర్కిల్‌లో వంతెన కిందకు మార్చారు. అయితే విగ్రహానికి పూలమాల వేయాలన్నా, నివాళులు అర్పించాలన్నా ఇబ్బందికరంగా ఉంది. అలాగే శిలాఫలకంలో అక్షర దోషాలు సరిచేయండి.

- మస్తానమ్మ, అధికార భాషా సంఘం, మాజీ సభ్యురాలు

పుట్టుకతోనే వికలాంగుడిని



నేను పుట్టుకతోనే వికలాంగుడిని. ఏ పనీ చేసుకోలేను. ఎంతో కాలంగా పింఛను తీసుకుంటున్నాను. అయితే వికలత్వం తక్కువగా ఉందని పింఛను నిలిపివేస్తున్నామంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. 70శాతానికి పైగా ఉన్న వికలత్వంతో ఎడమకాలితో నడవలేను. పింఛను నిలిపేస్తే బతకలేను.. న్యాయం చేయండి.

- ఆర్ముగం, వేదాంతపురం, తిరుపతి రూరల్

తుడా పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది

తిరుపతి రూరల్ రామానుజపల్లి ఉద్యోగనగర్ కాలనీలో తుడా అప్రూవల్ వెంచర్‌లో పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఆ స్థలంలో మొక్కలు నాటి మౌలిక వసతులు కల్పించాలి.

- బుజ్జిబాబు, రామానుజపల్లి, తిరుపతి రూరల్

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించండి

వెంకటగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును తొలగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఆర్.లక్ష్మి సంఘీభావం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించాలని 60 రోజులుగా కార్మికులు దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఒకే స్థానంలో కూర్చుని కార్మికులను వేధిస్తున్నాడని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అన్నారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వెంకటగిరి మున్సిపల్ వర్కర్స్

మసీదు స్థలాన్ని కాపాడండి

దుర్గసముద్రం జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మసీదు కోసం ఇచ్చిన పది సెంట్లను కొందరు ఆక్రమించుకునే ప్రయత్నిస్తున్నారని పలువురు మైనార్టీలు జేసీ శుభం బన్సల్‌ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషను కల్పించాలని బీఎస్పీ నేతలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఎక్స్‌రే యంత్రాన్ని వినియోగంలోకి తెస్తాం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న హెచ్‌డీసీ కమిటీ సభ్యులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వా స్పత్రిలో ఈ నెల 22న ఎక్స్‌రే యంత్రాన్ని వినియోగంలోకి తెస్తా మని ఆస్పత్రి హెచ్‌డీసీ కమిటీ సభ్యులు ఏలిమేటి సతీష్, హనుంతరావు, సరిత తెలిపారు. ఆంధ్రజ్యోతిలో 'దాతలిచ్చినవీ వినియోగించుకోలేరా? ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా ఎక్స్‌రే మెషిన్' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో హెచ్‌డీసీ కమిటీ సభ్యులు స్పందించారు. సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. ఎక్స్‌రే యంత్రం, నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌ను పరిశీ లించి ఆస్పత్రి సూపరిండెంట్ రమేష్‌తో మాట్లాడారు. ఈనెల 22న నుంచి ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాన్ని అందుబాటులోకి తెస్తామని, అలాగే అంబు లెన్స్‌ను కూడా స్వచ్ఛంద సంస్థకు అప్పగించి పేదలకు ఉపయోగ పడేలా చొరవ తీసకుంటామని చెప్పారు.

దాడి కేసులో వైసీపీ నేత అరెస్ట్

చిల్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వైసీపీ నేత వేమారెడ్డి కుమరస్వామిరెడ్డిని ఓ దాడి కేసులో సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మోమిడి గ్రామానికి చెందిన టీడీపీ నేత జాకీర్ మత్స్యకారులకు సంబంధించిన బోట్ల రిజిస్ట్రేషన్ విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, విచారించి సరిచేయాలని మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి ప్రోద్బలంతో ఆయన అనుచరులైన కొంతమంది జాకీర్‌పై దాడి చేసేందుకు అతని ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో జాకీర్ ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచారు. దీనిపై జాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఈనెల 8వ తేదీన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దాడికి ప్రోత్సహించిన వైసీపీ నేత కుమారస్వామిరెడ్డిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు గోపినాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, బాలు, వెంకటకృష్ణయ్య, రమణయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ భూములకు పరిహారం అందించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం తీసుకున్న భూములకు పరిహారం అందించా లని కోట మండలం గున్నంపడియ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నై - బెంగళూరు ఇండస్ట్రి యల్ కారిడార్ కోసం ప్రభుత్వం తమ గ్రామంలో సుమారు 200 ఎకరాల వరకు భూములను సేకరించడం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందించలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మట్టం శ్రావణి

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని, తగిన జాగ్రత్తలు పాటించాలని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు పీహెచ్‌సీలో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి సహకారంతో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శ్రావణి మాట్లాడుతూ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేసుకునే వీలుంటుందన్నారు. పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలి

చిల్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నక్కలకాలవకండ్రిగ వద్ద ఉన్న ప్రభుత్వ మిగులు భూములను నెలబల్లి రెట్టపల్లి గ్రామస్తులు సుమారు 22 ఏళ్లగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారికే పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, రమేష్, సునీల్, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. సోమవారం నాయుడుపేట విక్రమ్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, బాధితుల పట్ల వివక్షత చూపకుండా మానవతా దృక్పథంతో ఉండాలన్నారు. కార్యక్ర మంలో కళాశాల డైరెక్టర్ కె.సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించండి

చిట్టమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల జీవనోపాధి కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలంటూ చిట్టమూరులోని కొత్తగుంటలో సోమవారం ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. నాయుడుపేట, మాల్లాం, సూళ్లూరుపేట, కోట వైపు వెళ్లే వాహనాలను గంటసేపు నిలిపివేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు రసూల్, జానీ, అచ్చయ్య, గురవయ్య, వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాళెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... వేముల పాళెం గ్రామానికి చెందిన శివయ్య అనే వృద్ధుడు సైకిల్‌పై గూడూ రుకు వెళ్తుండగా పాతసంతరోడ్డు వద్ద ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొంది. శివయ్యకు గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని రెండో పట్టణ ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. సోమవారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగ కాలువలు ఇలా... నీళ్లు పారేదెలా?



ఓజిలి వద్ద ముళ్ల పొదలతో నిండిన గంగ బ్రాంచి కాలువ

ఓజిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైకి తాగునీరు, ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించే తెలుగు గంగ ప్రధాన, బ్రాంచి కాలువలు దుస్థితికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఓజిలి మండలంలో 47 చెరువుల కింద సుమారుగా 8వేల ఎకరాలకుపైగా వరి సాగు చేస్తు న్నారు. బ్రాంచి కాలువల ద్వారా మండలంలోని అన్ని చెరువులను గంగ నీటితో నింపి పంటలకు అందిస్తున్నారు. అయితే గంగ కాలువలు సరిగా లేకపోవడంతో చెరువులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఏర్పడింది. బ్రాంచి కాలువలు పూడిపోవడం, తుప్పలు, ముండ్ల పొదలు, గడ్డి ఏపుగా పెరిగిపోయి సక్రమంగా నీరు ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో రైతులు సాగు నీటికి ఇక్కట్లు పడుతున్నారు. వర్షాభావం నెలకొన్న సమయాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా వుంటుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క చెరువుకూ మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో చెరువుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. కలుజులు, తూములు లీకవుతుండడంతో ఉన్న నీరు వృథా అవుతోంది. దీంతో చెరువులకు చేరిన నీరు పట్టుమని పది రోజులు కూడా ఉండని పరిస్థితి ఉంది. ప్రధానంగా కొండవల్లిపాడు, విజయానెల్లూరు, అత్తివరం, వాజ్జవారిపాళెం, ఇనుగుంట, సగుటూరు, భువనగిరిపాళెం, కురుగొండ, మానమాల, కొత్తచెరువు, పున్నేపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో చివరి తడికి నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గంగ కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం వుంది.

చవితి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి



కాళంగి నది వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబు, పక్కనే సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్స వాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో చవితి ఉత్సవాలకు సంబంధించి ఆర్డీవో, డీఎస్పీ చెంచుబాబు, డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు నిర్వహించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు రెవెన్యూ, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో అను మతి ఇచ్చేలా సంబంధిత తహసీల్దార్లు చొరవ తీసుకోవాలని సూచిం చారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని చేయా లని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో, డీఎస్పీ, అధికారులతో వినాయక ప్రతిమల నిమజ్జనం చేసే కాళంగి నదీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో జాలిరెడ్డి, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి తహసీల్దార్లు రవీంద్రనాథ్ రెడ్డి, శరత్‌బాబు, శైలాకుమారి, రాజేంద్ర, హరికృష్ణ, పద్మావతి, సూళ్లూరు పేట, నాయుడుపేట, శ్రీసిటీ, సత్యవేడు సీఐలు మురళీకృష్ణ, బాబి, శ్రీనివాసులు, మురళి, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, స్వప్న, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. సోమవారం స్థానిక అలవల వారి కల్యాణ మండపంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ 11సంవత్సరాల నుంచి కట్టిన డిపాజిట్ల కోసం పోరాటం చేస్తున్నా... ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఒంగోలు చేపట్టే నిరసన కార్యక్రమంలో ఏజెంట్లు, బాధితులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని, ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్ర మంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రసాద్, శ్రీనివాసరావు, కందగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు మోదుగుల పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు, వేదికపై ప్రసాద్, శ్రీనివాసరావు, పార్థసారధి, నాగేశ్వరరావు

గురుకులంలో తహసీల్దారు తనిఖీలు



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం తహసీల్దారు జయజయరావు తనిఖీ చేశారు. విద్యార్థుల చేత వంట పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు నేపథ్యంలో గురుకులంలోని వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పనులు చేయించ వద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రమణయ్య, వైస్ ప్రిన్సిపాల్ సరిత రోజ్‌లిన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారి తీరుపై విమర్శలు

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులోని గ్రంథాలయ అధికారి తీరుపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. గ్రంథాలయంలోనే మద్యం సేవిస్తున్నారంటూ సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆయన తీరుపై పాఠకులు విమర్శలు చేస్తున్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు తీసుకుంటామని మున్సి పల్ మేనేజర్ ఉరుకుందమ్మ స్పష్టం చేశారు. సోమవారం ఆమె పట్టణంలోని భరత్‌నగర్‌లో పర్యటించి అక్రమ కొళాయి కనెక్షన్లను గుర్తించి ఆ ఇంటి యజమానులతో మాట్లాడారు. మున్సిపాలిటీ అను మతి లేకుండా తీసుకున్న కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించు కోవాలని, లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా మున్సిపల్ సేవలను నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది విజయరామయ్య, మోహన్‌కృష్ణ, సంగీత, శ్రీనివాసులు హరి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికలో వసతి గృహం ప్రారంభం



శ్మశానవాటికలో వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న సోల్లేటి శ్రీనివాసులు, కామిరెడ్డి రాజారెడ్డి తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది పరివా హక ప్రాంతంలోని హిందూ శ్మశానవాటికలో సోల్లేటి శ్రీనివాసులు భార్య ప్రవీణ జ్ఞాపకార్థంగా రూ.4 లక్షలతో అదనపు వసతిగృహాన్ని నిర్మించారు సోమవారం సోల్లేటి శ్రీనివాసులు, స్వర్గధామం కన్వీనర్ కామిరెడ్డి రాజారెడ్డి వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్వర్గధామం కార్యదర్శి మునగాల కృష్ణారావు, సభ్యులు పీడీ ఉదయ శంకర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, శశిధర్, కందనూరు సంజాయ్, రాఘవేంద్ర, జలంధర్, అంకయ్య, నైనప్పగారి కుమార్, కావేరిపాకం అశోక్, యతేంద్ర, మునిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభాయాత్ర

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించు కుని శోభాయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులను ట్రాక్టర్‌లో ఉంచి శోభాయాత్ర జరిపారు.

జాయింట్ ఎల్‌పీఎంల విభజనకు చర్యలు

పెళ్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాయింట్ ఎల్‌పీఎం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు హరికృష్ణ తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎం కలిగిన రైతులు గ్రామ సచివాలయాల్లో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంట కాలువ పనులను పూర్తి చేయండి

పెళ్లకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు చెరువుకు నీరందించే కాలువ పనులను పూర్తి చేయాలని ఆ గ్రామానికి చెందిన రైతులు తహసీల్దారు హరికృష్ణను కోరారు. జాతీయ రహదారి రోడ్డు నిర్మాణంలో భాగంగా చిల్లకూరు వడ్డిపాళెం వద్ద కొంత దూరం కాలువను పూడ్చివేయడం జరిగిందన్నారు. వర్షాకాలం ప్రారంభం అయినందున చెరువుకు సాగునీరు అందించే కాలువను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆరూరు బాలాజీ, రమణయ్య, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కోట క్రాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం, చిటే డు, విద్యానగర్, కోట ప్రాంతాల్లో సోమవారం రవాణాశాఖ అధికా రులు ప్రభాకర్‌రావు, శాంతి వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా, అధిక లోడ్‌తో తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు, ఆటోలను సీజ్ చేసి వాకాడు ఆర్టీసీ డిపో అధికారులకు అప్పగించారు. పలు ద్విచక్ర వాహనదారులకు రూ.80వేల జరిమానా విధించారు.

వాకాడు: మండలంలో పలుచోట్ల వాహనాలను రవాణాశాఖ అధికా రులు ప్రభాకర్‌రావు, శాంతి తనిఖీ చేశారు. అగ్రికల్చర్ వాహనాలను కమర్షియల్‌గా ఉపయోగిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆదేశించారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్

కోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోటలోని వెలుగు కార్యాలయంలో సోమవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఆడిట్ జరిగింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలోని 37 సంఘ బంధాలు, సంఘ మిత్రలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఆయా పథకాలకు సంబంధించి మంజూరైన నగదు, వినియోగానికి సంబంధించిన రికార్డులను ఆడిటర్లు కార్తికేయ, నారాయణరెడ్డి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం అనీలా, సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, అలివేలమ్మ, శంకర్, బిందు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే ప్రారంభం

తడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ సర్వే సోమవారం ప్రారంభమైంది. తడకండ్రిగ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో సర్వేను ప్రారంభించారు. ప్రతి ఇంటిని సర్వేచేసి వాటికి హక్కుదారు పత్రాలను మంజూరు చేస్తా మని పంచాయతీ కార్యదర్శి గ్యాబ్రియల్ చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించండి

తడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా మూడు సెంట్లు భూమి ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిం చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, కుమార్, చల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ కేవైసీ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఉన్నికృష్ణన్

గూడూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారు లందరూ తప్పనిసరిగా కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉన్నికృష్ణన్ సూచించారు. సోమవారం మండలంలోని రామలింగాపురంలో ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధ నల మేరకు ప్రతి ఖాతాదారుడు తమ ఆధార్, పాన్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను బ్యాంకుకు అందజేసి కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఆర్‌బీఐ సూచనల మేరకు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించి ఖాతాదారులను చైతన్య పరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్ర మంలో బ్యాంకు జడ్‌ఎం బంగారురాజు, ఎల్‌డీఎం రవికుమార్, సీనియర్ బీఎం బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో వెలగని వీధి లైట్లు

పొద్దుపోతే బయట తిరగలేక జనం ఇక్కట్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో 25 వార్డులు ఉండగా ప్రతి వార్డులోనూ కొన్నిచోట్ల వీధి లైట్లు వెలగడంలేదు. ప్రధానంగా సుదర్శన్ నగర్, నరసింహరావు వీధి, హనుమాన్ నగర్, తోలిమిట్ట, బొగ్గులమిట్ట తదితర ప్రాంతాల్లో వీధి లైట్లు లేక పొద్దుపోతే చీకటి అలుముకుంటోంది. మున్సిపాలిటీ సిబ్బంది వీధి దీపాల నిర్వహణ గురించి పూర్తిగా పట్టించుకోవడంలేదని, పలుమార్లు అధికారులకు తెలియజేసినా స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే మొన్ననే కదా కొత్త లైట్లు వేసింది.. అప్పుడే పోయాయా అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపించిన లైట్లు కొనుగోలు చేయడంతో, అవి మూన్నాళ్లకే చెడిపోతున్నాయని విమర్శిస్తు న్నారు. వీధి దీపాల నిర్వహణ గురించి పలుమార్లు కౌన్సిల్‌లో ప్రశ్నించినా అధికారులు స్పందించడం లేదని కౌన్సిలర్లు మండపడుతున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలె క్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. గురు వారం ఉదయం 8 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, మేన కూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపె నీలలో 530కి పైగా ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 5వ తరగతిపైన, పదవ తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత అయిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజ రయ్యే అభ్యర్థులు సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బుధ వారం స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 9985056929, 8639835953లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్‌డీసీలు దేవేందర్‌రెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్మాండ్, డీఆర్‌డీఏపీడీ శోభన్‌బాబు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి లోకనాథం పాల్గొన్నారు. కాగా, ఈనెల 20వ తేదీన నిర్వ హించనున్న దోమల నివారణ దినోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, సబ్ యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక



జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన చరిత్

గూడూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్‌ఎపీ పాఠశాలకు చెందిన విద్యార్థి చరిత్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 9వ తరగతి చదువుతున్న చరిత్ ఈనెల 11నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ సీబీఎస్‌ఈ ఆర్చరీ పోటీల్లో ప్రతిభచాటి సిల్వర్ మెడల్ సాధించారన్నారు. పంజాబ్‌లో సెప్టెంబరు 20నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీబీఎస్‌ఈ ఆర్చరీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సాయివిద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం దయాకర్ తెలిపారు. ఒంగోలులో ఈనెల 17వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మోక్షిత్ అండర్-12 విభాగంలో, గృష్ణేశ్వర్ అండర్-14 విభాగంలో ప్రతిభచాటి ద్వితీయ బహుమతులను సాధించారని తెలిపారు.



ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ఓట్ల చోరీ ప్రమాదకరం: కాంగ్రెస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేశాయని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆరోపించారు. పట్టణంలోని వీఎంసీ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బత్తెయ్య నాయుడు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఓట్ల చోరీపై ఆదివారం బీహార్‌లోని ససారం నుంచి యాత్ర ప్రారంభించారన్నారు. ఓట్లు చోరీ చేయడం వల్ల దేశ సమగ్రత కోల్పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పూడి రవికుమార్, జనార్ధన్‌రెడ్డి, ఈర్ల గోపి, నాగూరయ్య, సురేష్, మోహన్, బాలాజీ, వాణెమ్మ, భానమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి' కూరగాయలతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సోమవారం రైతులతో కలిసి ప్రకృతి వయసాయ కూరగాయల అమ్మకాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వ రాయితీలను ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రిసోర్సు పర్సన్లు జయలక్ష్మి, ఆశా, రేవతి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని గిరిజనుల ధర్నా



వరదయ్యపాళెం, ఆగస్టు 18: మండలంలోని రామిరెడ్డిపాళెం గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కాలనీ వాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ గిరిజనులకు ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, ఓటర్ గుర్తింపు కార్డులతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు చంద్ర, ఏఐవైఎఫ్ నాయకులు మురళి, గిరిజన సంఘం నాయకులు గంగయ్య, నాగరాజు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఏర్పేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు .. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌కు చెందిన పాళెం ప్రకాష్(29) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆదివారం శ్రీకాళహస్తికి వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా మేర్లపాక వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

చింతలపాళెంలో భూసేకరణ రద్దు చేయండి

సీపీఎం నాయకులతో కలిసి రైతులు ధర్నా



తహసీల్దారు భార్గవికి వినతిపత్రం వస్తున్న చింతలపాళెం రైతులు

ఏర్పేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాళెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను రద్దు చేయాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం రైతు నాయకులు మద్దతు తెలిపారు. రైతులు మాట్లాడుతూ చింతలపాళెంలో సర్వే నెంబరు 10, 13, 320, 321, 322, 323లలో ప్రభుత్వం భూసేకరణ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. భూములు ఇచ్చేదిలేదన్నారు. అనంతరం తహసీల్దారు భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు రంగయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వేదోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు చేశారు. పలు అభిషేకాలు చేశారు. హారతులు సమర్పించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పదోన్నతి పొందిన పోలీసు అధికారికి సన్మానం



గోపాల్‌రాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టు లైజనింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గోపాల్‌రాజుకు పోలీసుశాఖ ఏఎస్ఐగా పదోన్నతి కల్పించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయనను కోర్టు ఆవరణంలో పలువురు న్యాయవాదులు సత్కరించారు. న్యాయవాదులు కుంట్రపాకు సురేంద్రబాబు ముదిరాజ్, వెంకటాద్రి, రమణయ్య, భీమేశ్వరి, జనార్ధన్, కాకి చిన్న అంకయ్య, షణ్ముగం పాల్గొన్నారు.

'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'



శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై వినూత్నంగా తొట్టంబేడు పీహెచ్‌సీలో సోమవారం 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ తాలుకా కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా వైస్ ప్రెసిడెంట్ నీరజ, గంగయక్క, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో డీజేల నిషేధం

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భారీ శబ్దాలతో నిర్వహించే డీజేలు నిషేధమని శ్రీకాళహస్తి 1టౌన్‌సీఐ గోపి తెలియజేశారు. శ్రీకాళహస్తిలో డీజే నిర్వాహకులకు సోమవారం 1టౌన్ సీఐ గోపి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎస్టీల స్థితిగతులపై ఆరా

శ్రీకాళహస్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు యానాది కాలనీలను సోమవారం కేరళకు చెందిన సీపీఐ నాయకులు కుట్టిన్, సంతోష్‌తో కలిసి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య సందర్శించారు. యానాదుల స్థితిగతులపై ఆరా తీసి నమోదు చేసుకున్నారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారుశీల, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

జలగణన సర్వే చేయాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల పొదుపు చేయడానికి జలగణన సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. తన కార్యాలయంలో జలగణనపై వీర్వోలు, సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో రమేష్‌బాబు మాట్లాడుతూ బావులు గల రైతుల పేర్లు, సర్వే నెంబర్ల వివరాలు, చెరువులు, కుంటల వివరాలు తెలియజేయాలన్నారు. పెరుగుతున్న గృహ అవసరాలు, పంటలు సాగుతో పాటు జనాభాకు అవసరమైన నీటిని అంచనా వేసేందుకు జలగణన చేయాలన్నారు. ఈ సర్వేను ఈ నెల 31లో ఆన్‌లైన్‌లో చేయాలన్నారు.

పంట కాలువ ఆక్రమణలు తొలగించాలి




పంట కాలువను ఆక్రమించి వేసిన ఫెన్సింగ్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు చెరువు నుంచి సుగ్గుపల్లి గ్రామ చెరువుకు వచ్చే పంట కాలువ ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం నిరసన కార్యక్రమం చేట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపాలేడు గ్రామానికి చెందిన కొందరు రైతులు సుగ్గుపల్లి చెరువుకు వచ్చే పంట కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేసి కాలువను పూర్తిగా ఆక్రమించారని తెలిపారు. కాలువ ఆక్రమణకు గురికావడంతో ఎగువ నుంచి వచ్చేనీరు చెరువులోకి రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని చెరువు నిండకపోతే పంటలు వేయలేమన్నారు. కాలువ ఆక్రమణల గురించి ఆక్రమణదారులను అడిగితే పట్టించుకోవడం లేదన్నారు. కాలువను సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిప్రతం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

కలెక్టర్, జేసీ, ఎస్పీ, సీఎండీలకు ఎమ్మెల్యే ఆదిమూలం విన్నపాలు



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కారించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, విద్యుత్‌శాఖ సీఎండీ సంతోషరావులను కలిశారు. సోమ వారం ఉదయం తిరుపతిలోని వారివారి కార్యాలయాలకు చేరుకుని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలు, శ్మశాన సమస్యలు, ఇతర భూ సమస్యలు పరిష్కారం కోసం కలెక్టర్‌కు, జేసీకి, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతిపత్రం సమర్పించామని వివరించారు. పిచ్చాటూరు మండలం ముడియూరకు మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు త్వరగా టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సీఎండీకి విన్నవించామని తెలియజేశారు. త్వరలో సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తామని అందరూ తెలిపారని వివరించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: సీపీఐ

రేణిగుంట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ మండలంలో చోటా, మోటా నాయకులు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పద్మానగర్‌లో నిరుపేదలు కట్టుకున్న ఇళ్లను అధికారులు కూల్చడం తగదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పేదలకు మూడు సెంట్ల ఇంటిస్థలం ఇవ్వాలని కోరారు. రేణిగుంట పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు ఇంటిస్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, మండల కార్యదర్శి వైఎస్ మణి, సీపీఐ నాయకులు కార్తీక్, సెల్వ, సుబ్బరాజు, చంద్రకళ, భాను, రమణ, తరుణ్, అమ్ములు, శివగామి, మనీ, గంగా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు



సీపీఐ చేపట్టిన ధర్నాలో రేణిగుంట గ్రామ పంచాయతీలోని పలువురు పారిశుధ్య కార్మికులు యూనిఫామ్‌తోనే హాజరై మద్దతు తెలియజేశారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న గిరిజనులు

సత్యవేడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మండలంలోని చమర్తికండ్రిగ, పేరడం గ్రామాలకు చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చమర్తికండ్రిగ గిరిజన కాలనీలో ప్రధానంగా పంచాయతీ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో రెండు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 43/20లో 20 సెంట్ల మునీశ్వస్వామికి చెందిన భూమిని గ్రామానికి చెందిన భూస్వామి ఒకరు ఆక్రమించుకుని తనపేరుపైన ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. పేరడం గిరిజన కాలనీకి సమీపంలోని వరవ కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి దోమల కారణంగా జ్వరాల బారిన పడుతున్నామని తెలిపారు. కాలువలో మొక్కలు తొలగించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అరుణాచలం, మురళి తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి: సీపీఐ



తహసీల్దారు భార్గవికి వినతిపత్రం ఇస్తున్న విక్రుతమాల జగనన్న కాలనీలో నివసిస్తున్న పేదలు

ఏర్పేడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించి పేద ప్రజలను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి శివకుమార్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో నివసించే వారికి రెండు సెంట్లు, గ్రామాల్లో నివసించే వారికి మూడు సెంట్లు ఇస్తామన్న హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలని కోరారు. విక్రుతమాల, మర్రిమంద పంచాయతీ పరిధిలోని పేదలకు ఇచ్చిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దారు భార్గవికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, సత్యనారాయణ, గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్, మునిమోహన్ పాల్గొన్నారు.

సర్పంచ్ తల్లికి జడ్పీటీసీ నివాళి



నారాయణవనం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కళింమిట్ట గ్రామ పంచాయితీ సర్పంచ్ అయ్యప్ప శశికళ తల్లి సుశీలమ్మ(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. జడ్పీటీసీ సుమన్ కుమార్ ఆమెకు పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. అలాగే అయ్యప్పను ఎమ్మెల్యే ఆదిమూలం ఫోన్‌లో పరామర్శించారు. నివాళి అర్పించినా వారిలో నాయకులు ఆర్ముగం, సుధాబాబు, బీఎస్పీ నాయకులు ధనంజయ, జైభీమ్ నాయకులు మహేష్, దేవరాజులు, కుట్టి బాలయయ, సుబ్రమణ్యం, బుజ్జయ్య ఉన్నారు.

అందని ఉపాధి కూలి



అధికారులతో మాట్లాడుతున్న కూలీలు

కేవీబీపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి బిల్లులు చెల్లించాలని మండంలోని ఉపాధికూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 12 వారాలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు మాత్రం అందరికీ బిల్లులు పెటామని ప్రభుత్వం వాటిని ఇంకా విడుదల చేయలేదని చెబుతున్నారు. దీంతో వగత్తూరు, ఓళ్లూరు, పాత పాళెం, వేమలపూడి, రాయపేడు తదితర గ్రామాల్లో కూలీలు పనులకు వెళ్లడంలేదు. ఎగువపూడిలో ఏపీవో భాస్కరయ్య, ఏఈ భాస్కరరావు కూలీలతో సోమవారం మాట్లాడారు. పెండింగ్ కూలీలు చెల్లించాలని కూలీలు వారికి విన్నవించారు.

వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆస్పత్రి సమీపంలో మూసుకుపోయిన వీధుల్లో పిచ్చి మొక్కలను అధికారులు సోమవారం తొలగించారు. 'మూసుకుపోయిన వీధులు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు' అనే శీర్షికన గత వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఎంపీడీవో వెంకటరత్నమ్మ స్పందించారు. ఉపాధి హామీకూలీలతో ఆస్పత్రి నుంచి కార్యాలయాలకు వెళ్లే రోడ్డుతో పాటుగా సమీపంలో ఉన్న వీధుల వెంట పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

బాల్య వివాహాలు నేరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగష్టు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలోని విద్యార్థునులకు బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి

రేణిగుంట: గాజులమండ్యం గ్రామంలోని శ్రీకృష్ణ భజన మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ ఇందుకుమార్‌రెడ్డి పాలొన్నారు.

ఐఐటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ

ఏర్పేడు, ఆగస్టు18, ఆంధ్రజ్యోతి: ఐఐటీ హాస్టల్లో ఉంటున్న పది మంది విద్యార్థులకు సంబంధించిన 10 ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. ఒక్కో దాని విలువ లక్షా 20వేలు ఉంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి ఫోన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

పుత్తూరు వార్తలు

సరస్వతీదేవి విగ్రహానికి విరాళం



వడమాలపేట,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు కోసం పూర్వ విద్యార్థులు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం 1999-2000, వసవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రాజేష్, హేమంత్ స్వామిలు హెచ్‌ఎం విమలకు తమవంతు సాయంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో తులసిరామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వెన్నకృష్ణుడి అలంకరణ



వడమాలపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో సోమవారం శ్రీకృష్ణుడు వెన్న తినే కృష్ణుడి అవతారంలో దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో రాధా, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడిని విశేషంగా వెన్న తినేలా అలంకరించారు. ఉభయదారుడిగా గుర్రం జయకుమార్ వ్యవహరించారు.

పుత్తూరులో ట్రాఫిక్ కష్టాలు

● విద్యార్థులకు తప్పని పాట్లు ● పట్టించుకోని పట్టణ పోలీసులు



ఎంబీ రోడ్డులో గజిబిజిగా ఉన్న ట్రాఫిక్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రోజు రోజుకూ అభివృద్ధి దిశగా పయనిస్తోంది. విద్యా కేంద్రంగా బాసిల్లుతోంది. కానీ ఇక్కడ ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారింది. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో విద్యార్థులను ఇబ్బందులు పడ్డారు. ఏ వాహనదారుడు ఎటువైపు నుంచి వస్తాడో తెలియక ఆందోళనతో ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ట్రాఫిక్ విధులను హోంగార్డులు నిర్వహిస్తుండటంతో ఎక్కడా ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు పాటించడంలేదు. పుత్తూరు- తిరుపతి, నగరి మార్గాల్లో రోడ్డును చిరు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. ప్రైవేటు బస్సులు ప్రయాణికుల కోసం రోడ్డుపైనే నిలిపి ఉంచడం ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతోంది. ఉదయం, సాయంత్ర విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కూటమి ప్రభుత్వంలో విద్యకు అగ్ర తాంబూలం



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న పోతుగుంట విజయ్‌బాబు

పుత్తూరు అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు అగ్రతాంబూలం ఇస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొ న్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధనపాల్, చంద్రయాదవ్, మధుసూదన్‌రాజు, మణికంఠ, పోతుగుంట రమేష్, శ్రీనివాస మందడి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి: సీపీఐ



పుత్తూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, అనుభవంలోని ఇళ్ల స్థలాలకు పట్టాలు, పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పజెప్పాలని సోమవారం పుత్తూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీ నాయకులు ధర్నా చేశారు. ఆ పార్టీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, చంద్రబాబు, కృష్ణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

వాకర్స్ మాజీ అధ్యక్షుడికి నివాళులు

పుత్తూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): పుత్తూరు వాకర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా పనిచేసిన వెంకటేశ్వర్లు నాయుడు మృతిపై సోమవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్ఎన్ మూర్తి, రఫీ, గుణశేఖర్‌రెడ్డి, కుప్పయ్యశెట్టి, రామచంద్రనాయుడు పాల్గొన్నారు.